కథ



# అయ్యబాబోయ్...దెయ్యం

నక్కల ప్రభాకర్‌రెడ్డి

లాస్ట్ పీరియడ్ మాకు చానా ఇష్టం. ఎందుకంటే ఆ పీరిడ్డు లోనే కదా మేం ఆట్లాడుకునేది. ఆట్లంటే ఇష్టమే గానీ ఆట్లాడించే పీటి మాస్టరంటే గాదు. మా పీటి మాస్టారు భలేవాడు. ఒక నిమిషం లేటుగా గ్రౌండులోకి వచ్చిన వప్పుకోడు. గ్రౌండుచుట్టూ నాలుగు రౌండ్లు పరిగెత్తమనేవాడు. గస బోసుకుంటా పరిగెత్తి నాలుగు రౌండ్లు ఏసుకొని వచ్చినా వదిలేదిలే, మళ్లీ గుంజీలు నూరుపెట్టు అనే వాడు. మారు గుంజిల్లు పెట్టినాక మా ఆట అట్టయెక్కిపోయినట్లే గదా.

తెల్లార్తే ప్రేయరప్పుడు కూడా అంతే. క్లాసుల్లో నుండి వచ్చేటప్పుడు అరస్తా వచ్చినా. లైన్లో రాకపోయినా, లైన్లో సరిగ్గా నిల్చుకోకపోయినా చేతిలోని సన్నని కర్రతో పిర్రమీద వాత పడేటట్టు కొట్టేవాడు. ప్రేయరయిపోయిందంటే ఆయనకి ఇంక పనుండదు పాటుండదు. అయినా సాయంత్రం ఆట్ల పీరిడ్‌లో గ్రౌండ్‌లో నిలబడి 'ఈ స్కూల్లో క్రమశిక్షణ వుందంటే ఆ గొప్పంతా నాదే' అని బడాయిబోతా వుంటాడు. ఒక్కొక్కసారి ఏ ఐవోరయినా రాకపోతే మేం కాసరబీసరని అరస్తా వుంటామా, మా నోర్లకు బీగాలు ఏసేందుకు హెడ్ మాస్టరు పీటి మాస్టర్ని పంపిస్తాడు.

'గోల్లు గిల్లుకుంటా కూచునేదానికంటే పిల్లకాయిల్ని కొట్టేపని మేలుగదా' అని మా పీటి మాస్టరు వుషారుగా మా క్లాసుకు వచ్చేవాడు. వచ్చి రాంగనే ముందర లైన్లో కూచ్చున్న వాళ్లని వాళ్లు మాట్లాడుతున్నారా లేదా అని చూడకుండా, కన్ను తగల్తాందా, కాలు తగల్తాందా అని చూడకుండా చింతబర్రతో పటా..పటా... మని కొట్టుకుంటా బోయేవాడు.

గిత్తగా వుండేవాళ్లు ముందర, పొడుగ్గా వుండేవాళ్లు యనకాల కూచ్చునేవాళ్లు. యనకాలుండే నాయండ్లే ఎప్పుడూ గట్టిగా మాట్లాడేది. మేం మాట్లాడినా గుసగుసమనే మాట్లాడుకుంటాం. అయితే యనకాలుండే వాళ్లల్లో ఒకరిద్దరు లంబుగాళ్లు వుండేవాళ్లు. వాళ్లు సార్ మీద తిరగబడేవాళ్లు. దాంతో ఆయినికి కొంచెం బయ్యం. అందుకేవాళ్లను అదుపులో పెట్టేందుకు క్లాసులోకి వస్తానే ముందరున్న మమ్మల్ని చితకబాదేది. ముందరోళ్లకు పెళ్లయ్యేసరికి యనకోళ్లకూ భయం బుట్టి నోటికి బీగాలేసేవాళ్లు.

ఒక్కసారిగా క్లాసు నిశ్శబ్దమయ్యే సరికి 'దేవుడికైనా దెబ్బే గురువురా' అంటూ పెద్ద మొనగాని లాగా ఫోజు పెట్టేవాడు. ఆడికి వదల్దు. రేయ్, నేను జి.కే. కొచ్చిన్లు అడగతా, చెప్పండ్రా అంటూ ప్రెశ్నలేసి మమ్మల్ని ఆడుకునేవాడు.

మేము ఆన్సర్లు చెప్పకపోతే ఆయనే చెప్పి చూస్తిరా నా టాలెంటు... నేనంటే ఎవురనుకున్నారు. నా టాలెంటుకు కలెక్టరు కావాల్సినోన్ని. ఇంటర్వ్యూ చేసిన నాయాండ్లు మార్కులేయలేదు గానీ లేకపోతేనా.... అంటూ బీరాలుబోయేవాడు.

ఈయనికి ఎట్లైనా గాలి పీకాల్రా అని అందురూ అనుకునేవాళ్లం. అవకాశం కోసం ఎదురు చూస్తావుంటే ఆ పొద్దు రానే వచ్చింది.

మాస్కూలు గట్టి యేభై ఏళ్లు పూర్తయ్యిందనీ, స్వర్ణోత్సవ వేడుకలు చెయ్యాలని హెడ్‌మాస్టరు అందరికీ చెప్పినాడు. వేడుకల రోజు ఆటలు, నాటికలు, పాటలు లాంటివి చేయాలని చెప్పినాడు.

వేడుకల రోజు వచ్చింది.

ఉపన్యాసాలయినాయి. పాటలు పాడేవాళ్లు పాడతాండారు. డ్యాన్సులు చేసేవాళ్లు డ్యాన్సులు చేస్తా వుండారు. అవి అయిపోతానే మమ్మల్ని పిల్సనారు నాటిక ఏసేందుకు.

నేనూ, నా ఫ్రెండూ సత్తిగాడు ఇద్దరూ స్టేజీ పైకి పోయినా నాటకం మొదులైంది.

సత్తిగాడ్ని ఒక కుర్చీలో కూచ్చోబెట్టి వాడు కనపడకుండా నల్లటి దుప్పటీ కప్పేశినాను. చిన్న కర్ర ఎత్తుకొని మంత్రం వేస్తున్నట్లు ఓం...హ్రీం...భ్రూం.. అంటూ గట్టిగా అరుస్తూ కర్రతో వాడి చుట్టూ తిప్పాను. అందురూ ఏం జేస్తానా అని కళ్లింతవి చేసుకొని వూపిరి బిగపట్టి చూస్తా వుండారు.

'చూడండి... బాగా చూడండి. నేను మంత్రం వేశాను. ఈ దుప్పట్లో వున్న సత్తిగాడ్ని నేను దెయ్యంగా మార్చేశాను. కావాల్సుంటే వచ్చి చూసుకోండి' అన్నాను.

నేను దెయ్యాన్ని ఏమీ చేయలేనని అందరికీ నమ్మకమున్నా..

'దెయ్యం' అనేసరికి ఎవురూ లేలేదు.

నేనే స్టేజీ ముందుకు వచ్చి 'సరే... ఆరోతరగతిలో అందరికంటే ధైర్యవంతుడొకరు లేచిరండి' అని పిలిచాను.

కిట్టిగాడు సందేహిస్తూ లేచాడు.

కిట్టిగాడి ధైర్యానికి అందరూ చప్పట్లు కొట్టినారు.

కిట్టిగాడు బెదురు బెదురుగానే స్టేజీపైకి వచ్చినాడు.

'కిట్టిగా ధైర్యం దెచ్చుకో, పోయి దుప్పటి ఎత్తి చూడు' అన్నాను.

కిట్టిగాడు నెమ్మదిగా దుప్పిటి పట్టుకొని ఎత్తి లోపలికి చూసినాడో లేదో, అంతలోనే 'అయ్యబాబోయ్... దెయ్యం' అని గట్టిగా అరిచి దబ్‌మని పడిపోయాడు.

అందురూ భయపడిపోయినారు.

'ఇప్పుడు పదో తరగతిలో ఎవురైనా ధైర్యవంతులుంటే రావచ్చు' అన్నాను.

సరిత లేచొచ్చింది అందురూ చప్పట్లు కొట్టినారు.

దుప్పిటిలోకి తొంగి చూసి కెవ్...మని కేక పెట్టి దబ్‌మని పడిపోయింది.

ఎనిమిదో తరగతి నుంచి రాంగాడు, తొమ్మిదోతరగతి నుంచి చిన్నాగాడు, పదోతరగతి నుంచి పరాంకుశంగాడు. ఒక్కొక్కరుగా వచ్చినారు. రావడం, దుప్పట్లోకి తొంగి చూడ్డం 'అయ్యబాబోయ్... దెయ్యం' అని అరిచి దబ్‌మని పడిపోవడం జరిగిపోయినాయి. అందర్లోనూ ఆశ్చర్యం భయం.

'ఇప్పుడు టీచర్లలో ఎవురైనా ధైర్యవంతులుంటే వచ్చి చూడొచ్చు సార్' అన్నాను.

టీచర్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు.

నేనే కల్పించుకొని 'మన టీచర్స్‌లో ధైర్యవంతుడు, తెలివైన వాడు అయిన మన పీటి మాస్టరుని స్టేజి పైకి రావాల్సిందిగా కోరుతున్నాను. అన్నాను.

పొగిడేసరికి ఉబ్బిపోయి లేచి వచ్చాడు పీటి మాస్టరు స్టైలుగా నడుస్తూ....

అందరూ చప్పట్లు కొట్టారు.

'దుప్పిటిలోకి చూడండి  సార్' అన్నాను.

పీటి మాస్టరు ముఖాన చెమటలు పట్టడం నేను చూశాను.

లోపల భయంగానే వన్నా ముఖాన నవ్వును పులుముకుంటూ వెళ్లి దుప్పిటిలోకి తొంగి చూశాడు.

అంతే...

దుప్పట్లో వున్న సత్తిగాడు 'అయ్యబాబోయ్ దెయ్యం' అంటూ కుర్చీ మీద నుంచి దబ్‌మని పడిపోయాడు.

(మిత్రుడు అనిల్ డి ఇ ఓకి కృతజ్ఞతలతో) ★

